సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 5 । మే । 2024



బీదర్ కోటలో గెలుపెవరిది?

జహీరాబాద్ నియోజకవర్గానికి సరిహద్దులో ఉన్న కర్ణాటకలోని బీదర్ పార్లమెంట్ ఎన్నిక రసవత్తరంగా సాగుతోంది. వివరాలు IIలో ▸



కాంగ్రెస్, బీజేపీలను నమ్మరు

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. హత్నూర మండలంలో ప్రచారం నిర్వహించారు. వివరాలు IIలో ▸



పదేళ్లు గడుస్తున్నా పట్టింపేదీ?

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఓఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు నెంబర్–7 పనులు పూర్తి కాలేదు. వివరాలు IIIలో ▸

బతుకు బొమ్మలాట

కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిచి మొక్కితే అమ్మరా.. అని ఓ సినీకవి రాసినట్లు.. గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామ కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న బొమ్మలు అబ్బురపరుస్తున్నాయి. చెక్కలు సైతం వీరి హస్తాల్లో అద్భుత కళాఖండాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. వీరు తయారుచేసిన బొమ్మలను చూస్తే వాటికేమైనా జీవం ఉందా అనే అనుమానం కలగకమానదు. అంతటి ప్రావీణ్యంతో కూడిన కళారూపాలను చెక్కుతున్న కళాకారుల బతుకులు మాత్రం దుర్భరంగా ఉన్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం కరువై.. వచ్చిన పని చేయలేక, కొత్త పని దొరకక బతుకు భారమవుతోందని వారు వాపోతున్నారు. అందమైన బొమ్మల తయారీ వెనుక హస్తకళాకారుల బతుకు బాధలపై ప్రత్యేక కథనం.

- వి. శ్రీధర్‌చారి, జిన్నారం(పటాన్‌చెరు)

- చేతులతో చక్కని చెక్కబొమ్మల తయారీ
- 40ఏళ్లుగా ఈ వృత్తే జీవనాధారం
- అద్భుత ప్రావీణ్యం ఉన్నా.. ప్రోత్సాహం సున్నా..
- వచ్చిన పని చేయలేక.. కొత్త పని దొరక్క..
- వీరన్నగూడెం కళాకారుల దీనగాథ





యంత్రం ద్వారా చెక్కబొమ్మను తయారు చేస్తున్న కళాకారుడు

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామం హస్తకళలకు నిలయం. 40ఏళ్ల నుంచి ఈ గ్రామానికి చెందిన 35 మైనార్టీ కుటుంబాలు హస్త కళలో ప్రావీణ్యం సంపాదించాయి. వీరు అన్నిరకాల బొమ్మలను చెక్కతో తయారు చేసి సంతలు, జాతరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే హస్తకళా ప్రదర్శనలో ఉంచి విక్రయిస్తుంటారు. ఈ గ్రామ కళాకారులు బొమ్మల తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.70లక్షలతో ఫెసిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఒకేసారి 20మంది బొమ్మలను తయారు చేసుకునే వీలుండేలా హస్తకళల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.

అవసరమయ్యే ముడిసరుకు..

చెక్క బొమ్మలను తయారు చేసేందుకు ముఖ్యంగా పాలకుడిష కట్టెను వినియోగిస్తారు. ఈ కట్టెను ప్రత్యేక యంత్రాన్ని ఉపయోగించి కావాల్సిన ఆకారంలో బొమ్మను తయారు చేస్తారు. వివిధ రకాల రంగులతో కూడిన లక్కను తయారు చేసి బొమ్మకు అద్దుతారు. బొమ్మకు తగిన ఫినిషింగ్ ఇచ్చేందుకు మొగిలి ఆకును వినియోగిస్తారు.

బొమ్మల రకాలు

ఈ గ్రామ కళాకారులు వివిధ రకాల బొమ్మలు, వస్తువులు తయారు చేస్తుంటారు. ముఖ్యంగా బండ్లు, పిడికిలి, పీటలు, గురుగుల పెట్టె, కోలలు, కోలా, రోకలి, ఇసుర్రాయి, దొంతులు, స్కిప్పింగ్ స్టిక్స్, గణపతులు, ఏనుగు, కోతులు, గుర్రాలు, కుందేళ్లు లాంటి అన్నిరకాల ఆకారాలను రూపొందిస్తుంటారు.




కామన్ ఫెసిలిటీ కేంద్రం...

వీరన్నగూడ గ్రామంలో కేంద్ర హస్తకళల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రూ.70లక్షలతో 2019లో కామన్ ఫెసిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 20మంది కళాకారులు అవసరమైన ముడిసరుకును తెచ్చుకొని యంత్రాల సహాయంతో బొమ్మలు తయారు చేసుకుంటారు. కళ ఉన్నా యంత్రాలు లేని వారికి చేయూతను అందించేందుకు ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

అందమైన బొమ్మల వెనుక..

అందమైన బొమ్మల తయారీ వెనుక కళాకారుల బాధలు వర్ణనాతీతం. రంగుల బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు ఉపాధి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందించకపోవటంతో కొంత మంది కళాకారులు ఉపాధిని వదులుకుంటున్నారు. వచ్చిన పని చేయలేక, కొత్త పని దొరకక తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కళాకారులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లేకపోవటం, మార్కెట్‌లో బొమ్మలకు గిరాకీ తగ్గటంతో కళాకారులు తమ వృత్తికి దూరం అవుతున్నారు. తాము తయారు చేసిన బొమ్మలను ప్రభుత్వం కొనుగోలు చేస్తే మరింత ఉపాధి పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. బొమ్మలు తయారు చేసే యంత్రాలతో పాటు ఉపయోగించే ముడి సరుకును తమకు సబ్సిడీపై అందించాలని బ్యాంకుల నుంచి రుణసదుపాయం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము తయారు చేసిన బొమ్మలకు మరింత ప్రచారం అవసరమని ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారులు కోరుతున్నారు. కాగా, వీరన్నగూడ గ్రామంలో తయారు చేసిన చెక్క బొమ్మలకు హైదరాబాద్‌లో మాత్రం భలే గిరాకీ ఉంటుంది. ఇక్కడ తయారు చేసిన బొమ్మలను నగరంలోని హస్త కళల కేంద్రానికి తరలిస్తారు. మార్కెట్ ధరలకు అక్కడ డబ్బు చెల్లిస్తారు.









చెక్క బొమ్మలను తయారు చేస్తున్న కళాకారులు

ప్రోత్సాహం అందించాలి

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. బొమ్మలకు తగిన ధరను అందించాలి. ముడి సరుకులకు మార్కెట్లో ఎక్కువ ధర ఉంది. దీంతో మాకు కూలీ కూడా పడటం లేదు.

– షేక్ పాషు



ఎన్ని బొమ్మలైనా చేస్తాం

చేతి వృత్తి పనిని చేసేందుకు మేము ముందుంటాం. ప్రభుత్వం ఎన్ని ఆర్డర్లు ఇచ్చినా బొమ్మలను తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. బొమ్మల తయారీకి కావాల్సిన వస్తువులను ప్రభుత్వం అందించాలి.

– రేష్మా



ముడి సరుకును ఉచితంగా అందించాలి

బొమ్మల తయారీకి కావాల్సిన ముడి సరుకు దొరకటం లేదు. అది ప్రభుత్వమే అందిస్తే బాగుంటుంది. ముఖ్యంగా కట్టె లభించటం లేదు. బొమ్మల ఆర్డర్లు కూడా పెంచాలి.

– ఫక్రుద్దీన్

హస్త కళను ప్రోత్సహిస్తున్నాం

రాష్ట్ర వ్యాప్తంగా హస్త కళను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వీరన్నగూడలో హస్త కళాకారుల కోసం ప్రత్యేక ఫెసిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు 400మంది కళాకారులకు మూడు దశల్లో శిక్షణ అందించాం. వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా సత్వరమే పరిష్కరిస్తున్నాం.

– శ్రీవణి, హస్తకళల అభివృద్ధి సంస్థ డిప్యూటీ మేనేజర్, హైదరాబాద్

న్యూస్‌రీల్

క్యూఆర్ కోడ్ ద్వారా వైద్యసేవలు



క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ప్రారంభించిన వైద్యులు

పటాన్‌చెరు టౌన్ : క్యూఆర్ కోడ్ స్కాన్‌తో వైద్య సేవలు ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వసుంధర తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్కానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపీ స్లిప్పుల కోసం లైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదని, నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎం డాక్టర్ ప్రవీణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ దివాకర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించండి

సంగారెడ్డి టౌన్ : జాతీయ లోక్ అదాలత్‌లో పోలీసులు చొరవ చూపి కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర సూచించారు. శనివారం జిల్లా కోర్టులో జడ్జిని ఎస్పీ రూపేష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాలలో ఫ్రీజ్ అయిన డబ్బును విడుదలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీ ఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

పటాన్‌చెరు టౌన్ : కలెక్టర్‌గా ఉన్న సమయంలోనే తెల్లాపూర్ మున్సిపాలిటీ భూములను ధరణి పోర్టల్ నుంచి తొలగించిన ఘనుడు బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆరోపించారు. శనివారం పటాన్‌చెరు డివిజన్‌లో కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శ్రీరామ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఐదు గ్యారెంటీలతో పాటు 25 సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సామయ్య, యువరాజ్ మోరే, ఎస్‌కే అతిక్, అర్జున్, బాలు, సతీష్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

‘అందోల్’ ప్రజలంటే అభిమానం

- వారికోసం ఏమైనా చేస్తా..
- మున్ముందు మరింత అభివృద్ధి
- సమష్టి కృషితో సురేష్ షెట్కార్‌ను గెలిపించండి
- మంత్రి దామోదర రాజనర్సింహ

పుల్‌కల్(అందోల్) : ప్రాజెక్టులో ముంపునకు గురికాకున్నా సింగూరును పునరావాస గ్రామంగా ఎంపికచేసి పరిహారం ఇప్పించామని మంత్రి దామోదర రాజనర్సింహ గుర్తు చేశారు. ప్రత్యేక పరిస్థితిలో ఆ గ్రామాన్ని పునరావాసంగా ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. శనివారం మండల పరిధిలోని బస్వాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గ ప్రజలంటే తనకు ప్రత్యేక అభిమానమని, వారికోసం ఏమైనా చేస్తానని హామీ ఇచ్చారు. సింగూరు సాగునీటి కాలువకు సిమెంట్ లైనింగ్, పుల్‌కల్, అజ్జమర్రి వద్ద మంజీరా నదిపై వంతెనలు మంజూరు చేశామని తెలిపారు. వట్‌పల్లిలో ప్రభుత్వాస్పత్రి, అందోల్ మండలంలో నర్సింగ్ కళాశాల, సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మున్ముందు మరింత అభివృద్ధి జరుగుతుందని, కార్యకర్తలు సమష్టి కృషితో లోక్‌సభ ఎన్నికల్లో సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో దుర్గారెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, వీరేశం స్వామి, గోవర్దన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర

బీజేపీకి ఓటేస్తే బానిస బతుకులే

మంత్రి కొండా సురేఖ

సంగారెడ్డి టౌన్ : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే బానిస బతుకులవుతాయని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఒక్కసారి ఆలోచన చేసి ఓటేయాలని ఆమె కోరారు. శనివారం సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మద్దతుగా సీపీఎం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రివర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రైవేటీకరణను పెంచి పోషిస్తున్న ప్రధాని మోదీకి పేదల కష్టాలు పట్టవని విమర్శించారు. ఇందిరమ్మ హయాంలో మెదక్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటు ద్వారా వేలాదిమందికి ఉపాధి దక్కిందని గుర్తు చేశారు. రాజీవ్ ప్రధానిగా ఉన్నప్పుడే ఐటీ రంగానికి బీజం పడిందని, మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకువచ్చారని పేర్కొన్నారు. 25 ఏళ్ల వెనుకబాటుకు గురైన మెదక్ ప్రాంతం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మతోన్మాద శక్తులను ఎదిరించాలి

దేశంలో మతోన్మాద రాజకీయ శక్తులను ఎదిరించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆ దిశగా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే కార్మిక చట్టాలు ఖతమవుతాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి పరిపాలన కొనసాగించినందుకే ఆ పార్టీకి ప్రజలు చరమగీతం పాడారని స్పష్టం చేశారు. నీలం మధును గెలిపించుకుందామని ఆయన అన్నారు.

టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమస్యల పరిష్కారం

తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. టోల్ ఫ్రీ నంబరు ద్వారా సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ అభ్యర్థి నీలం మధు హామీ ఇచ్చారు. ప్రజలంతా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు, సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం, సిఐటీయూ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్, సిపిఎం జిల్లా నాయకులు మల్లేశం, రాజయ్య, వాజిద్ అలీ, మాణిక్యం పాల్గొన్నారు.



ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

డిజైర్ సొసైటీ సేవలు అభినందనీయం



ప్రారంభోత్సవంలో జెన్నీఫర్ లార్సన్

జిన్నారం(పటాన్‌చెరు): ఎయిడ్స్ చిన్నారులకు డిజైర్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ కొనియాడారు. మండలంలోని బొల్లారంలో ఎయిడ్స్ చిన్నారుల కోసం డిజైర్ సొసైటీలో సమ్మర్ క్యాంపును శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిజైర్ సొసైటీ అధినేత రవిబాబు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ అందిస్తున్న సబ్సిడీని రైతులు ఉపయోగించుకుని ఆయిల్ పామ్ పంట సాగు చేసి అధిక లాభాలు పొందాలని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి సోమేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ పంటను పరిశీలించి వేసవిలో తోటల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ పంట ద్వారా రైతులకు ఎకరాకు 50 మొక్కలు రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శ్రీధర్, స్పందన, గోద్రేజ్ ఫీల్డ్ అధికారి భరత్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి, సిబ్బంది తరలింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. శత శాతం పోలింగ్ లక్ష్యంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సెక్టార్, సహాయక సెక్టార్ అధికారులకు ఏర్పాటు చేసిన మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

పటాన్‌చెరు టౌన్ : మండల పరిధి రుద్రారం శివారులోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూముల వద్ద మూడు అంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన సిబ్బంది నియామకం, అవసరమైన సామగ్రి ఏర్పాటు పనులు పూర్తయినట్లు తెలిపారు. మీడియా సెంటర్ వద్ద జర్నలిస్టులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పాల్గొన్నారు.



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వరం

సంగారెడ్డి : లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో అలసత్వం చూపితే కఠిన చర్యలుంటాయని ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వరం హెచ్చరించారు. శనివారం అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్‌లో ఉన్న ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే తీసుకునే చర్యల గురించి ఆరా తీశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, బందోబస్తు తదితర అంశాల గురించి ఎస్పీ రూపేష్‌ను అడిగి తెలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం రవాణాపై నిఘా పెంచాలన్నారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగే సంఘటనలు జరిగితే తన మొబైల్ నంబర్ 9177299185కు ఫోన్ లేదా మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, ఆర్డీఓ వసంత కుమారి, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ పాల్గొన్నారు.



ఈవీఎం సెంటర్‌ను సందర్శిస్తున్న రామేశ్వరం

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేడు నీట్.. ఏర్పాట్లు పూర్తి

కొండాపూర్(సంగారెడ్డి): దేశ వ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)ను ఆదివారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 3,619 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో 672 మంది, కరుణా హైస్కూల్‌లో 504 మంది, సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో 480 మంది, సెయింట్ ఆంథోనీ జూనియర్ కళాశాలలో 360 మంది, సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో 360 మంది, సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో 360 మంది, పయనీర్స్ స్కూల్లో 312, ఆర్నాల్డ్ హై స్కూల్‌లో 288, రిషి హైస్కూల్లో 283 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు జరగనుందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, హాల్ టికెట్ తీసుకురావాలని అధికారులు సూచించారు. 1.30గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా సెంటర్‌లోకి అనుమతించబోమని తెలిపారు.



పరీక్షకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

క్లుప్తంగా

కుదిరిన ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, విజయవాడకు చెందిన బయో వే సంస్థ మధ్య శనివారం పరస్పర సహకార ఒప్పందం జరిగింది. ములుగు విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్.బి.నీరజ, బయో వే సంస్థ తరఫున డాక్టర్.ఎం.లక్ష్మీప్రసాద్ తదితరులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వీసీ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్, పసుపు, టమాటా, మిరప, కుకుర్బిట్స్ లాంటి ఉద్యాన పంటలపై పరిశోధన, సహకారం, అధ్యయనం ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

ముగియనున్న మల్లన్న ఆలయ కమిటీ పదవీకాలం


కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి పునరుద్ధరణ కమిటీ పదవీకాలం నేటి (ఆదివారం)తో ముగియనుంది. గత జనవరిలో ప్రారంభమై మూడు నెలలపాటు కొనసాగే జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టేందుకు 20 మందితో కూడిన పునరుద్ధరణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 8న బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఆలయ కమిటీ పదవీకాలం తీరిపోయింది.

ఇసుక తరలిస్తే చర్యలు

గజ్వేల్‌రూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ పోలీసులు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు, వేబిల్ లేకుండా ఓ లారీలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది.ఈ మేరకు శనివారం రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ శివారులో టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.

బీదర్ కోటలో గెలుపెవరిది?

- హ్యాట్రిక్‌పై కేంద్ర మంత్రి భగవంత్ కుబా గురి
- రాష్ట్ర మంత్రి ఈశ్వర్‌ఖండ్రే కుమారుడిని గెలిపించుకునేనా!
- బీదర్ పార్లమెంట్‌లో ముఖాముఖి పోరు
- బీజేపీ తిరుగుబాటు అభ్యర్థితో కుబాకు తలనొప్పి
- ఈనెల 7న బీదర్ పార్లమెంట్ స్థానానికి పోలింగ్
- బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్య ఉత్కంఠ పోరు



రాష్ట్రంలోని జహీరాబాద్ నియోజకవర్గానికి సరిహద్దులో ఉన్న కర్ణాటకలోని బీదర్ పార్లమెంట్‌కు ఎన్నిక రసవత్తరంగా సాగుతోంది. ఒకరు రాజకీయ ఉద్దండుడు అయితే, మరొకరు రాజకీయాల్లో పసివాడు. వీరి మధ్యే ప్రధాన పోరు నెలకొంది. బీదర్ పార్లమెంట్ స్థానం నుంచి 2014 ఎన్నికల్లో 96 వేల మెజార్టీతో, 2019 ఎన్నికల్లో 1.16 లక్షల మెజార్టీతో వరుసగా గెలుపొందుతూ వస్తున్న కేంద్ర మంత్రి భగవంత్ కుబా హ్యాట్రిక్ కొట్టేందుకు మరో మారు ఎన్నికల బరిలో నిలిచాడు.

– జహీరాబాద్

బీదర్ పార్లమెంట్ పరిధిలో జేడీఎస్ సైతం బలంగా ఉన్నా బీజేపీ-జేడీఎస్‌ల మధ్య ఎన్నికల ఒప్పందం కుదరడంతో బీజేపీకి అవకాశం దక్కింది. ఈ పార్లమెంట్ పరిధిలోమైనార్టీల ఓట్లు సైతం గణనీయంగా ఉన్నాయి. బీదర్ పట్టణ అసెంబ్లీ నుంచి రహీంఖాన్ ఎన్నికై రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో రహీంఖాన్, ఈశ్వర్‌ఖండ్రే మంత్రులుగా ఉన్నారు. దీంతో వీరు ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో వీరు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. పార్లమెంట్ స్థానానికి మొత్తం 18 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధాన పోటీ బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్యే నెలకొంది.

బరిలో బీజేపీ తిరుగుబాటు అభ్యర్థి

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తిరుగుబాటు అభ్యర్థిగా భాల్కికి చెందిన సీనియర్ నాయకుడు డాక్టర్ దినకర్ మోరె పోటీ చేస్తున్నాడు. అతడు టికెట్ ఆశించినా అధిష్టానవర్గం అనుగ్రహించ లేదు.

భగవంత్ కుబా హ్యాట్రిక్ కొట్టేనా



కేంద్ర మంత్రి భగవంత్ కుబా హ్యాట్రిక్ కొట్టి మరో మారు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇందు కోసం ఆయన పార్టీ కేడర్‌ను నిద్రపోనీయకుండా ప్రచారం చేయిస్తున్నారు. ప్రజలు మరో మారు నరేంద్ర మోడీ ప్రధాని కావాలని కోరుకుంటున్నందున ఆయన చరిష్మాతోనే ప్రచారం చేస్తున్నారు.

కుమారుడిని గెలిపించుకునేనా



రాజకీయాల్లో సుదీర్ఘ కాలంగా ఉంటున్న భాల్కి నియోజకవర్గానికి చెందిన ఈశ్వర్ ఖండ్రే ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో అటవీశాఖ మంత్రిగా ఉన్నారు. బీదర్ పార్లమెంట్ స్థానం నుంచి తన కుమారుడు సాగర్ ఖండ్రే(26)ను బరిలోకి దింపారు. ఈసారి ఎలాగైనా ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

7న పోలింగ్

ఈ నెల 7వ తేదీన బీదర్ పార్లమెంట్ స్థానానికి ఎన్నిక జరగనుంది. ఇందు కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ తగిన చర్యలు చేపట్టింది. మొత్తం 18,92,916 ఓటర్లు ఉండగా, 2024 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

పార్లమెంట్ పరిధిలో మరాఠాలు సైతం అత్యధిక సంఖ్యలో ఉన్నందున వారి మద్దతును కూడగట్టే ప్రయత్నంలో దినకర్ మోరే ప్రయత్నిస్తున్నారు.

8 నియోజకవర్గాలు

బీదర్ పార్లమెంట్ పరిధిలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. బీదర్ జిల్లాలోని బీదర్ సౌత్, బీదర్ నార్త్, భాల్కి, ఔరాద్, హుమ్నాబాద్, బస్వకళ్యాణ్, గుల్బర్గా జిల్లాలోని చించోళి, అలంద్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

తెలుగు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం

బీదర్ పార్లమెంట్ పరిధిలో తెలుగు ఓటర్లు సైతం అధికంగా ఉన్నారు. వారి ఓట్లను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు గాను బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందు కోసం ఆయా పార్టీలు తెలంగాణకు చెందిన నేతలతో ప్రచారం చేయించుకున్నారు.

పొలిటికల్ హీట్

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం హత్నూర మండలం రొయ్యపల్లి, షేర్ఖాన్పల్లి, కోడిపాక, కొత్తగూడెం, నాగారం, ఎల్లమ్మ గూడా, వడ్డేపల్లి, కోనంపేట, చింతల చెరువు, రెడ్డిపాలెం, గుండ్ల మాచ్నూను, తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్లలో బీజేపీ దేశాన్ని ఉద్ధరించింది ఏమీ లేదన్నారు. కేసీఆర్ తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ నాయకులు గోవర్ధన్ రావు, నర్సింహా రెడ్డి, శివశంకర్ రావు, రమేశ్ నాయక్, రామచంద్రారెడ్డి, రవి, శ్రీకాంత్, నరేందర్, వీరేశం గౌడ్, వీరేందర్, అజ్మత్ అలీ, కిషోర్, కృష్ణతోపాటు తాజా మాజీ సర్పంచ్‌లు పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల అబద్ధాలు నమ్మొద్దు

కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ శెట్కార్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేశ్ శెట్కార్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రతి పక్షాలు చెప్పే అబద్ధాలను నమ్మొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని మాజీ ఎంపీ, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ శెట్కార్, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల పరిధిలోని చీకూర్తి, రత్నాపూర్, మల్గి, కాకిజన్‌వాడ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్‌ఎస్, బీజేపీలు లేని పోని అబద్ధాలు చెబుతున్నాయని, వాటిని నమ్మొద్దన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు మహమ్మద్ తన్వీర్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రప్ప, గౌసొద్దీన్, సిద్ధి లింగయ్యస్వామి, రఫీయొద్దీన్, అజాంపటేల్, రాజప్ప, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి


మాట్లాడుతున్న వెంకట్రామి రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారిస్తానని తెలిపారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈప్రాంతం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, శ్రీశైలం, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు శ్రీపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశం సుభిక్షం

- కాంగ్రెస్‌తో భద్రత కరువు
- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్)/మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్‌తో భద్రత కరువు.. మోదీతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలు కారుకు పంక్చర్ చేయడంతోపాటు కాళేశ్వర్యంలో ముంచారని మెదక్ ఎంపీ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల కేంద్రంతోపాటు కాళ్లకల్, కూచారం గ్రామాల్లో బైక్ ర్యాలీ, శివ్వంపేటలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తే భద్రత కరువని, దేశంలో బాంబులు పేలుతాయని, మోదీ రాకతో అలాంటి పరిస్థితి రాలేదని, దేశం సుభిక్షంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజలను వంచించి కోట్లు కొల్లగొట్టారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి కోకాపేట్‌లో రూ.వంద కోట్లకు పైగా ఖర్చు పెట్టి భూములు కొనడానికి డబ్బు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్, హరీశ్‌రావుల దొంగ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి రఘునందన్‌రావు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌చారి, నాయకులు నత్తి మల్లేశ్, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, ఆయిలయ్య, అజయ్‌కుమార్, శ్రీకాంత్, నరేశ్, గోపాల్, ప్రభాకర్‌గౌడ్, నర్సింలు, భిక్షపతి, శివ్వంపేట రోడ్ షోలో పార్టీ మండల అధ్యక్షుడు రవి, నాయకులు మురళీధర్ యాదవ్, బుచ్చేష్‌యాదవ్, రాజేందర్, రఘువీరా రెడ్డి, రమణరావు, భిక్షపతి, కొండల్‌రావు, అశోక్, భాస్కర్, శ్యామ్, శేఖర్, తదితరులు ఉన్నారు.

నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- గజ్వేల్‌లో కాంగ్రెస్ బైక్ ర్యాలీ


మాట్లాడుతున్న జగ్గారెడ్డి

గజ్వేల్: మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులు నానా ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్‌లో బీఆర్‌ఎస్‌పై ఆధిక్యమే లక్ష్యం కావాలని, అలా చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మాజీ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, మాజీ తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్‌ఖాన్, సీపీఐ నాయకులు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సేవ కోసమే ప్రత్యక్ష రాజకీయాల్లోకి

మాజీ గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్


మాట్లాడుతున్న తమిళి సై

సంగారెడ్డి: రామరాజ్యం కావాలంటే మరోసారి మోదీ ప్రధాని కావాలని మాజీ గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా విశిష్ట అభియాన్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మోదీ హయాంలో ఆయుష్మాన్ భారత్ కింద చాలా మంది లబ్ధి పొందారన్నారు. రూ.10 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని గుర్తుచేశారు. ఇండియా కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదు.. కానీ బీజేపీలో మాత్రం మోదీనే అని తెలిపారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశానికి చేసింది ఏమీ లేదని, అసలు ఆయనకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందించడమే తన లక్ష్యమన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, అలె భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, కసిని వాసు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణ శివారులోని వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు చేశారు.

కారు బోల్తా


బోల్తాపడిన కారు

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మాట్‌పల్లి శివారులో 161 జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నారాయణఖేడ్‌కు చెందిన అనీల్ కారులో ఖేడ్ నుంచి పని నిమిత్తం హైదరాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో బొడ్మాట్‌పల్లి శివారులో కారు వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్ఐ చుక్కయ్య వివరాలు సేకరించారు.

గడ్డివాములు దగ్ధం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రమాదవశాత్తు ఐదు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం బద్రాృ తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బద్రాృ తండాకు చెందిన కడావత్ మంజ్యానాయక్ కుటుంబ సభ్యులకు చెందిన ఐదు గడ్డివాములు, సుమారు 2 వేల గడ్డి మోపులు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బాధితుడు కడావత్ మంజ్యా గడ్డివాములకు ఎవరో నిప్పు పెట్టారని అనుమానం వ్యక్తం చేశాడు.

అనుమానాస్పదంగా శిశువు మృతి


పాప విద్య

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పదంగా 45 రోజుల ఆడ శిశువు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన జ్ఞానేశ్వర్, భార్య స్వప్నతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటున్నాడు. కాగా పనిపై జ్ఞానేశ్వర్ స్వగ్రామం నాందేడ్‌కు వెళ్లాడు. భార్య స్వప్న 45 రోజుల శిశువుతో ఇంటి వద్దే ఉంది. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు తల్లి స్వప్న వద్ద పాలు తాగిన శిశువు ఉదయం చూసేసరికి ఉలుకూ, పలుకూ లేకుండా ఉంది. వెంటనే ఆమె భర్తకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. అనంతరం పాపను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిరుత పులి దాడిలో లేగ దూడ..


మృతి చెందిన లేగదూడ

హవేళిఘణాపూర్(మెదక్): చిరుత పులి దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శాలిపేటలో గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సాయిలు రోజులాగే అటవీ ప్రాంతం శివారులో పొలం వద్ద పశువుల కొట్టంలో లేగదూడను కట్టి వేసి వచ్చాడు. రాత్రి పశువుల కొట్టంలో లేగదూడపై చిరుతపులి దాడి చేయగా దూడ మృతి చెందింది. యజమాని సాయిలు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. బీట్ ఆఫీసర్ హరి నాయక్ సందర్శించి చిరుత దాడి చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. వెటర్నరీ అధికారితో పోస్టుమార్టం నిర్వహించామని, రిపోర్టు అనంతరం బాధితుడికి సాయం కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న కూలీలు

- గతం కంటే 2,500 మంది అధికం
- రోజు వారి కూలి రూ.300 పెంచిన ప్రభుత్వం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

మునిపల్లి(అందోల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్రమక్రమంగా కూలీల సంఖ్య పెరుగుతోంది. ఈసారి కూలి రేటు పెంచడంతో పనులు చేయడానికి కూలీలు మొగ్గు చూపుతున్నారు. గతంలో రోజు వారి కూలి రూ.272 ఉంటే ప్రస్తుతం ఏప్రిల్ 15వ తేదీ నుంచి రూ.300 ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉపాధి పనులు జోరందుకున్నాయి. పనుల్లో భాగంగా నీటి కుంటలో పూడిక తీత, వరద కాల్వల మళ్లింపు, చెట్ల తొలగింపు, తదితర పనులు చేయిస్తున్నారు.

2500 మంది అధికం

ఏప్రిల్ 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు 2500 మంది కూలీలు గతంలో కంటే అధికంగా పని చేయడానికి వస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. జాబ్ కార్డు కలిగిన వారందరూ పనుల్లోకి రావాలని అధికారులు సైతం సూచిస్తున్నారు. జిల్లాలో 2.2 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. 24 మండలాల్లోని 647 గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.

రూ.500 ఇవ్వాలి



ఉపాధి హామీ పథకంలో కొలతలతో సంబంధం లేకుండా రూ.500 చొప్పున రోజు వారి కూలి ఇవ్వాలి. కొలతల కారణంగా డబ్బులు తక్కువ వస్తాయి. ప్రతి కూలీకి ఇన్సూరెన్స్ చేయించాలి. అనివార్య కారణాల వల్ల పని చేస్తున్న చోట కూలి మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు మంజూరు చేయాలి.

– బోయిని నర్సింలు

అందరికీ పని కల్పిస్తాం



ప్రతీ కూలీకి రోజు వారిగా రూ.300 వచ్చే విధంగా పనులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించాం. పెరిగిన కూలి డబ్బులతో ఎక్కువ మంది పనులకు వచ్చే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకంలో ఎంత మంది పని చేస్తామంటే అంత మందికి పని కల్పిస్తాం.

– జ్యోతి,డీఆర్‌డీఏ పీడీ